www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 19 డిసెంబర్ 2024

5



డాక్టర్ బిఆర్.అంబేద్కర్

కోనసీమ

కాలువ గట్టు రోడ్డును ఆధునీకరించాలి



ఆందోళన చేస్తున్న స్థానికులు

ప్రజాశక్తి - మామిడికుదురు

మామిడికుదురు మెయిన్ రోడ్డు నుంచి లూటుకుర్రు కాలువగట్టు రోడ్డు ఆధునీకరించాలంటూ బుధవారం స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. రెండు కిలోమీటర్ల మేర ఉన్న ఈ రహదారి గోతులతో అధ్వానంగా మారడంతో నిత్యం రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు 15 ఏళ్లగా సమస్యను పాలకులకు, అధికారులకు స్పందించడం లేదన్నారు. ఈ రహదారి ఆధునీకరణకు శాసనసభ్యులు నిధులు మంజూరు చేసి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కడలి రామకృష్ణ, స్థానికులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం

- బహిరంగ సభలో సిపిఎం నాయకులు
- ముగిసిన సిపిఎం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మహాసభ
- కన్వీనర్‌గా కారెం వెంకటేశ్వరరావు ఎన్నిక



ప్రదర్శనలో పాల్గొన్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - అమలాపురం

కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో రెండు రోజుల పాటు జరిగిన సిపిఎం జిల్లా మహాసభ బుధవారంతో ముగిసింది. అనంతరం ప్రెస్‌క్లబ్ నుంచి ప్రదర్శన జరిగింది. తరువాత అమలాపురం గడియారస్తంభం సెంటర్‌లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆంధ్ర మాల్యాద్రి అధ్యక్షతన బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సుబ్బరావమ్మ మాట్లాడారు. దళితులు, గిరిజనులు, మైనార్టీలు, మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత హిందుత్వం పేరుతో మతఘర్షణలు పెరిగాయన్నారు. మనువాదాన్ని ప్రోత్సహిస్తూ దళితులు, బహుజనులపై దాడులకు పాల్పడుతుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్ల అయినా నేటికీ కులవివక్ష కొనసాగుతుందన్నారు. దళితులకు, గిరిజనులకు రక్షణగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టాన్ని బిజెపి సర్కారు నీరు గార్చిందన్నారు. ఆంధ్ర మాల్యాద్రి మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అవహేళనగా మాట్లాడటం దుర్మార్గమన్నారు. ఎన్నికల ముందు అంబేద్కర్ పేరుతో జపం చేసి అధికారంలోకి వచ్చాక ఆయన పేరు ఎత్తుకూడదని చెప్పడం సిగ్గు చేటన్నారు. బిజెపి భారత రాజ్యాంగాన్ని నాశనం చేస్తుందన్నారు. దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐవి మాట్లాడుతూ కౌలు రైతులందరికీ కౌలుదారు కార్డులు ఇవ్వాలన్నారు. వారికి రుణాలు మంజూరు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలులో నిబంధనలను సడలించాలన్నారు. సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కోనసీమలో రోడ్లు, కాలువగట్లకు ఇరువైపులా ఉన్న కొబ్బరి చెట్లను భూస్వాముల నుంచి స్వాధీనం చేసుకుని దళితులు, పేదలకు అందివ్వాలన్నారు. లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలోనే స్వాధీనం చేసుకుంటామన్నారు. టిడ్కో లబ్ధిదారుల బ్యాంకు రుణాలను రద్దు చేయాలన్నారు.



సభలో మాట్లాడుతున్న మాల్యాద్రి, పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐవి

'అముడా' అభివృద్ధికి కృషి : మంత్రి అచ్చెన్నాయుడు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం జిల్లా కేంద్రం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(అముడా) అభివృద్ధికి నా వంతు సహకారం అంది స్తానని రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్, పశువర్ధక డైరీ డెవలప్మెంట్, మత్స్య శాఖల మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు. బుధవారం స్థానిక మెట్ల రామలక్ష్మి కళ్యాణ వేదిక నందు అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ అధ్యక్షులుగా అల్లాడ స్వామి నాయుడు పదవీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ అముడా అధ్యక్షులుగా రాజకీయంగా 42 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం కలిగిన వ్యక్తిని ఎంపిక చేసినట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఆ దిశగా అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ మరింత వేగం పుంజుకోనున్నదని ఆయన ఆకాంక్షించారు. పార్టీలో కష్టపడి పని చేసే కార్యకర్తలను గుర్తించి ప్రభుత్వం నామినేటెడ్ పదవులను కేటాయించడం అభినందనీయమన్నారు. సిఎం చంద్రబాబు ఉమ్మడి తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాలో రోడ్ల అభివృద్ధికి కార్యాచరణ ప్రయాణించిన వారు వచ్చే విధంగా పిపిపి మాదిరిగా టోల్ ఫీజు వసూలు చేసేం దుకు కార్యా చరణ ప్రాజెక్టు రూపొందించేందుకు యోచన చేస్తున్నారని, ద్విచక్ర వాహనాలు ట్రాక్టర్లు, ఆటోలు వంటి వాటిపై టోల్ ఫీజు ఉండదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర కార్మిక శాఖ వాసంశెట్టి సుభాష్ మాట్లా డుతూ కీలకమైన బాధ్య తలతో మరింతగా శ్రమిం చి అమలాపురం జిల్లా కేంద్రాన్ని అభివద్ధి పథంలో పయనింపజేయాలని స్వామి నాయుడును కోరారు. ఎంపిలు యనమల రామకృష్ణుడు ప్రసంగించారు. సభకు అధ్యక్షత వహించిన స్థానిక శాసన సభ్యులు అయితా బత్తుల ఆనందరావు మాట్లాడుతూ అమలాపురం ప్రాంత అభివద్ధికి మాస్టర్ ప్లాన్ ప్రకారం రూ.65 కోట్ల నిధులు రోడ్ల విస్తరణ కొరకు అవసరం ఉన్నదని 7 వంతెనలు నిర్మాణం కొరకు మరో రూ.20 కోట్లు ఖర్చు అవుతుందని తదనుగుణంగా పట్టణం లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించగలమని మంత్రికి విన్నవించారు. ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ కోనసీమ ప్రాంతంలో డెల్టా ఆధునికరణ చేపట్టాలని మంత్రికి తెలియజేశారు. కొత్తపేట ఎంఎల్ఎ సత్యానందరావు మాట్లాడుతూ పట్టణ గ్రామీణ ప్రాంత అభివృద్ధికి ఆదర్శం తమైన ప్రణాళికలు రచించి అభివద్ధికి శ్రీకారం చుట్టాలని ఆకాంక్షించారు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడుతో ప్రమాణ స్వీకారం చేయించారు .ఈ కార్యక్ర మంలో అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ళ జోగేశ్వర రావు, పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, మెట్ల రమణబాబు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది మందితో నూతన కన్వీనింగ్ కమిటీ ఎన్నిక



కారెం వెంకటేశ్వరరావు
సిపిఎం జిల్లా కన్వీనర్

అమలాపురం ప్రెస్‌క్లబ్ పచ్చిమాల వసంతరావు నగర్‌లో జరిగిన సిపిఎం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మహాసభ బుధవారంతో ముగిసింది. నూతన కన్వీనింగ్ కమిటీ ఎన్నిక జరిగింది. సిపిఎం జిల్లా కన్వీనర్‌గా కారెం వెంకటేశ్వరరావు తిరిగి రెండోసారి ఎన్నికయ్యారు. కన్వీనింగ్ కమిటీ సభ్యులుగా కె.కృష్ణవేణి, డాక్టర్ చల్లా రవికుమార్, డివి.రావు, గుదే దుర్గాప్రసాద్, నూకల బలరాం, టి.నాగవరలక్ష్మి, ఎస్.జోగేష్, డి.ఎ.లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మహాసభలో పలు తీర్మానాలను ఆమోదించారు.



జి.దుర్గాప్రసాద్



ఎన్.బలరాం



కె.కృష్ణవేణి



సిహెచ్.రవికుమార్



నాగవరలక్ష్మి



డివి.రావు

తీర్మానాలు ఇవీ...

- శ్రామిక మహిళలకు కనీస వేతనాలు చెల్లించాలి, ఉద్యోగ భద్రత కల్పించాలి
- కౌలు రైతులందరికీ కౌలుదారు కార్డులు అందించాలి. అన్ని వ్యవసాయ ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలి..
- దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలు, మైనార్టీలు, మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలను అరికట్టాలి
- కరెంట్ ఛార్జీలను వెంటనే తగ్గించాలి. స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలి.
- కొబ్బరి ఒలుపు, దింపు ఇతర అనుబంధ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఇసుక రీచ్‌ల్లో పనుల కోసం నిరసన



తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఆత్రేయపురం ఇసుక రీచ్లో పనులు పూర్తిగా కల్పించాలంటూ కూలీలు తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు దీంతో ఇసుక ర్యాంపులో బుధవారం ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. ఆత్రేయపురం ఇసుక రీచ్‌లో కూలీల ద్వారానే ఇసుక ఎగమతులు చేసి టాక్టర్ల ద్వారా స్టాక్ పాయింట్ కు ఇసుక తరలిస్తున్నారు. అక్కడినుండి లారీలకు మిషన్ల ద్వారా ఇసుక ఎగుమతులు జరుగుతున్నాయి కూలీలకు ప్రతిరోజు పనులు కల్పించకపోవడంతో వారు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు . ప్రతిరోజు కూలీలందరికీ పనులు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. దీనిపై తహశీల్దార్ టి.రాజేశ్వరరావు ప్రతి రోజూ పనులు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో కూలీలు నిరసన విరమించారు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

విద్యుత్ శాఖ ఎఇ టి.అశోక్ ఆధ్వర్యంలో ఆత్రేయపురం మహాత్మా గాంధీ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం ఎస్ఎ రైటింగ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అశోక్ మాట్లాడుతూ ఎల్ఈడి బల్బ్స్ ఉపయోగించాలని, ఉపయోగించని ఉపకరణాల స్విచ్ ఆఫ్ చేయాలన్నారు. ప్రతి వ్యక్తి ఒక యూనిట్ ఆదా చేస్తే దేశంలో 135 కోట్ల యూనిట్స్ విద్యుత్తు పొదుపు అవుతుందన్నారు. విద్యార్థులకు విద్యుత్ పొదుపు అవగాహన కార్యక్రమంలో పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందజేశారు.




స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ అశోక్

పోలీస్‌స్టేషన్ ఆవరణలో పరిశుభ్రతకు చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణ పరిశుభ్రతకు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ ఎం.అశోక్ అన్నారు. ఈ బుధవారం ఆయన సిబ్బందితో కలిసి ఆవరణలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయన మాట్లా డుతూ ప్రాంగణ మొత్తాన్ని పరిశుభ్రం చేసి క్రీడలకు అనుకూలంగా తయారు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో విద్యార్థులు తమ ఆసక్తిగల ఆటలను మెరుగుపరుచుకు నేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఆయన వెంట పోలీసులు రవి తదితరులు ఉన్నారు.



'వైభవ్' షోరూమ్ ప్రారంభం



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ ఆనందరావు, వైభవ్ సంస్థల సిఎండి భారత మల్లికా రత్న కుమారి

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురములో వైభవ్ జ్యూయలర్స్ 17వ షోరూమ్‌ను బుధవారం విశిష్ట అతిథిలు ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. వైభవ్ సంస్థల సిఎమ్‌డి భారత మల్లికా రత్న కుమారి గ్రంధి, హోల్టైమ్ డైరెక్టర్ సాయి కీర్తన గ్రంధి, సిఒఒ గోంట్ల రాఖాల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింధూరి వెంకటేష్, ఎండి వైభవ్ జ్యూయలర్స్(ఏలూరు) అమరేంద్ర గ్రంధి , బోనం కనకయ్య, అల్లాడి శరత్ బాబు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశిష్ట అతిథులు మాట్లాడుతూ వైభవ్ జ్యూయలర్స్ తమ విస్తృతమైన శ్రేణి అద్భుతమైన పనితనం గల బంగారు ఆభరణాలను ఇప్పుడు అమలాపురం చుట్టుపక్కల ఉన్న వినియోగదారులకు అందించటం శుభపరిణామమని, అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వైభవ్ సంస్థ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ జె.రఘునాథ్ మాట్లాడుతూ వినియోగదారులకు అద్భుత శ్రేణిషాపింగ్ అనుభవంతో పాటు విస్తృత శ్రేణిలో 916 హాల్మార్క్, బంగారు ఆభరణాలు, సర్టిఫైడ్ డైమండ్స్, 925 స్వచ్ఛత కలిగిన 100 శాతం తిరిగి కొనుగోలు హామీ గల స్టెర్లింగ్ సిల్వర్ వస్తువులను, సాధారణ వెండి వస్తువులు జ్యూయలరీ అందించాలనే ఉద్దేశ్యంతో నేడు తమ వైభవ్ జ్యూయలరీ 17వ షోరూమ్‌ను అమలాపురంలో ప్రారంభించు చున్నామన్నారు. ప్రారంభోత్సవ కానుకగా సాధారణ బంగారు ఆభరణములపై తరుగు 6.9 శాతం నుంచి సాధారణ వెండి వస్తువులు పట్టీలపై తయారీ ఛార్జీలు లేకుండా తమ అమలాపురము షోరూమ్‌లో అంది స్తున్నామన్నారు. వినియోగదారులు తమ సేవలను వినియోగించుకోవాలని తెలియజేశారు. ఈ సందర్భంగా జరి గిన 'మన అమలాపురం గురించి తెలుసుకుందాం కాంటెస్ట్' డ్రాలో గెలుపొందిన 10 మంది విజేతలు (ఒక్కొక్కరికి 1 గ్రాము 22 క్యారెట్ బంగారు కాయిన్) లను అందజేశారు.

విద్యార్థుల సంక్షేమానికే ప్రాధాన్యత : డిఇఒ



గురుకుల పాఠశాల విద్యార్థులతో డిఇఒ డాక్టర్ బాషా

ప్రజాశక్తి - ముమ్మిడివరం

వసతి గృహాల్లోని విద్యార్థుల సంక్షేమానికి వసతి గహ సంక్షేమ అధికారులు అత్యధిక ప్రాధాన్యత నివ్వాలని డిఇఒ డాక్టర్ షేక్ సలీం బాషా సూచించారు. తానేలంక పంచాయతీ పరిధిలోని అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వసతి గృహంలోని విద్యార్థినిలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వసతి గృహంలో అపరిశుభ్ర పరిస్థితులు పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అపరిశుభ్రత వాతావరణంలో ఆహార పదార్థాలు వండటం, అదే వాతావరణంలో విద్యార్థులు భోజనం చేస్తుండడాన్ని గుర్తించారు. దీనిపై వసతి గృహ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇటువంటి పరిస్థితులు విద్యార్థుల అనారోగ్యానికి దారితీస్తాయన్నారు. తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధనకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లంక ఆఫ్ తానేలంక జిల్లా పరిస్ ఉన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థుల నోట్‌బుక్‌లను, సిలబస్ ప్రకారం బోధన సాగుతుందా లేదా విద్యార్థుల అభ్యసన స్థాయి ఏ విధంగా ఉంది తదితర విషయాలను పరిశీలించారు. పాఠశాలపై హెచ్ఎం పర్యవేక్షణ సంతప్తికరంగా లేకపోవడాన్ని గమనించి తగు సూచనలు చేశారు.అలాగే విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి వారి అభ్యసన స్థాయిని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌తో పాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ ప్రారంభంలో పాల్గొన్నకూటమి నేతలు

సిసి రోడ్డు నిర్మాణం ప్రారంభం

ప్రజాశక్తి - ఆలమూరు

చొప్పెల్ల ఇందిరా కాలనీలో ఉపాధి నిధులతో మంజూరు కాబడిన రూ. 20 లక్షలతో నిర్మాణం చేపడుతున్న సిసి రోడ్లుకు బుధవారం కూటమి నాయకులు హాజరై పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి మాజీ చైర్మన్ ఆకుల రామకృష్ణ, కూటమి నాయకులు సోము శ్రీనివాస్, పల్ల శ్రీను, బల్ల హరి కష్ణ, సకుమళ్ళఆది పట్టాభిరామన్న, సోము గంగాధర్, కొత్తపల్లి శివ, సాయి, రాజేష్, సూరిబాబు, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.



పనుల వివరాలను నివేదిస్తున్న కోటయ్య

అచ్యుతాపురంలో ఉపాధి గ్రామ సభ

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

అచ్యుతాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. కార్యదర్శి దేవి ప్రసన్న అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఎస్ ఆర్‌పి ఇ.కనకారావు పాల్గొని మాట్లాడారు. ఈ సంద ర్భంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డిఆర్‌పి డి.కోటయ్య గ్రామంలో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ లో సేకరించిన పనుల వివరాలను సభలో చదివి వినిపించారు. సభలో కార్యదర్శి దేవి ప్రసన్న, ఎన్‌ఆర్ఇ జిఎస్ ఎపిఒ రవి కిరణ్, జెఇ పి.రజిత్‌సింగ్, టెక్నికల్ అసిస్టెంట్లు జె.లోవ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - రావులపాలెం

స్థానిక లిటిల్ ఫ్లాక్ లూథరన్ చర్చిలో బుధవారం షేరింగ్ ది క్రిస్మస్ జాయ్ వేడుకలు చైర్మన్ కప్పల వరప్రసాద్ అధ్యక్షతన రెవరెండ్ డామియన్ ఇశ్రాయేలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ టిడి.స్వరూప్‌దత్, ఎంపిడిఒ జి.రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. అనంతరం పేదలకు దుప్పట్లు, చీరలను పంచి క్రిస్మస్ కేక్ కట్ చేసారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన యుటిఎఫ్ కార్యవర్గం సభ్యులు

ఉత్సాహంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ

ప్రజాశక్తి - అయినవిల్లి

యుటిఎఫ్ అయినవిల్లి యుటిఎఫ్ స్వర్ణోత్సవ మండల మహాసభ సమావేశం బుధవారం అమలాపురం యుటిఎఫ్ హోమ్‌లో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐవి), టీచర్ ఎంఎల్‌సి బొర్రా గోపి మూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయ, పాఠశాలల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కషి చేస్తామని, 117 జిఒ రద్దు చేయాలని, టీచర్లకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని, పన్నెండవ పిఆర్‌సిని అమలుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. గత పదవ తరగతి పరీక్షల్లో మండల ప్రథమ స్థానం పొందిన అయినవిల్లి మండలం కొండుకుదురు ఉన్నత పాఠశాల్లోని 92 మంది విద్యార్థులకు ముఖ్యఅతిథుల చేతుల మీదుగా టెన్త్ స్టడీ మెటీరియల్ ను అందజేశారు. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నికల్లో గౌరవ అధ్యక్షులుగా జి.సాయి శ్రీనివాస్, అధ్యక్షులుగా టిబి.ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా బి.సందీప్, అసోసియేట్ అధ్యక్షులుగా కె.సురేష్‌బాబు, అధ్యక్షురాలుగా కె.నాగలక్ష్మి, ఆర్థిక కార్యదర్శిగా పిఎస్.నాగేంద్రరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మహాసభకు అధిక సంఖ్యలో యుటిఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు కుటుంబాలకు మంత్రి ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న మంత్రి సుభాష్

ప్రజాశక్తి- రామచంద్రపురం

ఆర్థిక ఇబ్బందులు పడుతున్న రెండు కుటుంబాలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారంరూ.35 వేలు సాయం అందజేశారు. మండలంలోని కాపవరం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వనుం లక్ష్మి కుటుంబానికి రూ.15 వేలు ఆమె భర్త వనుం నాగేశ్వరావుకు అందజేశారు. అదేవిధంగా కాజులూరు మండలం ఉప్పుమిల్లి గ్రామంలో పిడుగు పడి మృతి చెందిన నంది కోళ్ల వీరస్వామి భార్యకు రూ. 20 వేల సాయం అందించారు. భర్తను కోల్పోయి ఇద్దరు పిల్లలతో ఉన్న కుటుంబానికి, ఆర్థిక పరిస్థితులతో సతమతమవుతూ అనారోగ్యం బారిన మంచాన పడిన కుటుంబానికి తన వంతు సాయంగా ఆర్థిక సాయం అందించానని మంత్రి సుభాష్ తెలిపారు. కార్యక్రమంలో మంత్రి సుభాష్ వెంట కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి 'జ్ఞాన జ్యోతి' శిక్షణ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాల నందు గురువారం నుంచి మూడు రోజుల పాటు జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తారని సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్వ ప్రాథమిక విద్యార్థులను చైతన్య వంతులుగా తీర్చి దిద్దేందుకు జ్ఞాన జ్యోతి శిక్షణ దోహదం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ120 రోజుల సర్టిఫికేట్ కోర్సును తొలుత డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ ల(డిఆర్పి)కు మూడు రోజుల పాటు రిఫ్రెష్మెంట్ శిక్షణ ఇస్తున్నామన్నారు.



పాశర్లపూడిలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సు

పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలోని పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు బుధవారం నిర్వహించారు. అధికారులు పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. **మామిడికుదురు**: ప్రజల వద్దకు వచ్చి భూసమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల లక్ష్యం అని మండల ప్రత్యేక అధికారి రామ్మోహన్ రావు అన్నారు. పాశర్లపూడిలో సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి అధ్యక్షతన బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ వైవి.సుబ్రహ్మణ్యాచార్యులు ప్రజల నుంచి అర్జీల స్వీకరించారు వాటిని సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, ఉప సర్పంచ్ తుండూరి బుజ్జి, పంచాయితీ కార్యదర్శి జి వాసు, రెవెన్యూ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు. **రాజోలు:** ప్రజలకు భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు లేకుండా రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేస్తామని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపడుతుందని రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం రాజోలు మండలం శివకోడు గ్రామంలో సర్పంచ్ నక్కా రామారావు అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరక్టర్ పెదకాపు, నీటి సంఘాల డిసి పినిశెట్టి బుజ్జి, తహశీల్దార్ ఎస్‌ఎస్‌ఎస్.ప్రసాద్, శివకోటి ఎంపిటిసి సభ్యులు ఉండ్రు సూర్యారావు, బొడ్డు కృష్ణా రావు పలువురు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** రైతు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ పి.చిన్నారావు అన్నారు. బుధవారం వల్లూరు, నల్లూరు, గ్రామాల పంచాయతీ కార్యాలయాల వద్ద, నిర్వహించిన గ్రామ సభలో గ్రామాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఐ అజ్జమ్మ, విఆర్ఒలు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్ పోటీల్లో డిగ్రీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్

ప్రజాశక్తి - రావులపాలెం

కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఫిజికల్ డైరెక్టర్ యన్.యువరాజు తెలిపారు. మంగళవారం రాజోలులోజరిగిన కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎస్ విజయరాజు, వి.వరప్రసాద్ పాల్గొని విజయం సాధించారు. 91 కేజీల విభాగంలో విజయరాజు గోల్డ్ మెడల్, 67 కేజీల విభాగంలో వరసత్య ప్రసాద్ సిల్వర్ మెడల్ సాధిం చారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థుల ను ప్రిన్సిపల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ అధి కారి ఎస్.అరుణకుమార్, వైస్ ప్రిన్సిపల్ యు.రమేష్ బాబు, అధ్యాపక సిబ్బం ది చినబాబు తదితరులు అభినందించారు.

సమన్వయంతోనే సర్వతోముఖాభివృద్ధి



సమావేశంలో పాల్గొన్న ఇన్‌ఛార్జి మంత్రి అచ్చెన్నాయుడు తదితరులు

ప్రజాశక్తి - అమలాపురం

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వ యంతో పనిచేస్తే అంబేద్కర్ కోనసీమ జిల్లా సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని జిల్లా ఇన్‌ఛార్జి, వ్యవసాయ సహకార, మార్కెటింగ్ పశుసంవర్ధక డైయిరీ డెవలప్మెంట్, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ప్రాథమిక రంగ సెక్టార్, వాటి అనుబంధ రంగాలైన వ్యవసాయం, నీటిపారుదల, పశుసంవర్ధనం, డైయిరీ డెవలప్మెంట్ ఉద్యాన, మత్స్య విభాగాలతోపాటుగా ఉచిత ఇసుక పాలసీ ద్వారా ఇసుక సరఫరా, ధాన్యం కొనుగోలు, జలవనరులు ప్రక్రియ, దీపం 2 పథకం, పెంచిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యు మెంట్ తదితర అభివద్ధి అంశాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి మంత్రి మాట్లా డుతూ జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధిని సాధించే ందుకు అందరి మద్దతు అవసరమ న్నారు వ్యవసాయంలో అధునాతన సాంకేతికత నూతన వరి వంగడాలు హైబ్రిడ్ కొబ్బరి వంగడా లను అందించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాల న్నారు స్థానిక ప్రజానీకానిక తలసరి ఆదాయం రూ.1.80 లక్షలు ఉండి 22వ స్థానంలో నిలిచిందని దీన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు విశాఖపట్నం, విజయవాడలో తలసరి ఆదాయం రూ.2.70లక్షలు ఉందన్నారు. వ్యవసాయ ఆధారి త జిల్లాగా పేరు గాంచిన కోనసీమ జిల్లాలో వ్యవ సాయ అనుబంధ రంగా ల కొబ్బరి ఉత్పత్తులను విలువ ఆధారితంగా మార్చే పరిశ్రమల స్థాప నకు పారిశ్రామిక వేత్తల ను ఆహ్వానించి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు రాజోలు తూర్పు పాలెం నందు కొబ్బరి ఆధారిత ఎంఎస్ఎంఇ రాయితీలతో ప్రోత్సహించి స్వయం ఉపాధి అవ కాశాలు కల్పించి జీవన ప్రమాణాలను మెరుగుపరచాలన్నారు. సుదీర్ఘ తీర ప్రాంతం కలిగిన కోనసీమ జిల్లాలో హార్బర్లు, జెట్టీలు, ఫిష్ లాండింగ్ సెంటర్లు ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయం తో ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పర్యాటకారంగానికి జిల్లా ఎంతో అనువైనదని ఆ దిశగా గ్రోత్ ఇంజన్ ప్రణాళికలతో ఒక ఏజెన్సీని తీసుకునివచ్చి అమలు చేయటానికి తన వంతు ప్రయ త్నం చేస్తాన న్నారు. టెంపులు సముద్ర ఏ ప్రాంతాలతో సర్క్యూట్ టూరిజంకు చర్యలు చేపడతామని తద్వారా ఉపాధి ఉద్యోగ అవకాశా లతో పాటు ఆదాయం వస్తుందన్నారు. ఏడాది పొడవునా మూ డు పంటలు పండే సార వంతమైన భూములు ఆక్వా చెరువు లు కింద మారకుండా ప్రభుత్వ నిబంధనలను తప్పనిస రిగా అమలు చేయాల న్నారు. వ్యవసాయానికి ఆమోదయోగ్యంగా లేని పల్లంగా ఉన్న చౌడు పర్ర భూములను మాత్రమే ఆక్వా జోన్లో తీసు కోవాలన్నారు స్థానికంగా జిల్లా కార్యాలయాలు జిల్లా కలెక్టర్ కార్యా లయం నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుం దన్నారు. ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన ప్రశ్నకు సమాధామిస్తూ రాయవరం అమలాపురం రైతు బజార్లు ఎస్టేట్ అధికారులను నియమించి పున ప్రారంభించాలని ఆదేశించారు. ఏడు ఫిషింగ్ ల్యాండ్ సెంటర్లు అభివృద్ధికి చర్యలు తీసుకుం టామన్నారు. జలవనరుల శాఖ సమీక్షలో సుదీర్ఘకాలంగా కాలువలు, డ్రయినేజీల్లో పూడికతీతలు పనులు సంబంధించి ఎంఎల్ఎలు, అధికారులు సమన్వ యంతో ప్రాధాన్యత క్రమంలో ఆమోదయోగ్య మైన పనులు ప్రతి పాదిస్తే నిధులు సమీకరణకు పై స్థాయిలో చర్యలు చేపడ తానని తెలిపారు. ఫిబ్రవరి నెలలో ప్రతిపాదనలు సమర్పించాలని కాలువలు మూసివేత సమయంలో పనులు నిధులు మురిగిపోకుండా పనులు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఉన్న 12 ఇసుకరీచులలో 8 రీచ్‌ల ద్వారా ఎంఎల్‌సిలు, ఎంఎల్ఎలు సహకా రంతో ఇసుక తవ్వకాల ప్రారంభించి డిమాండ్‌కు అనుగుణంగా ఇసుక సరఫరాకు చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు. జిల్లా కలెక్టర్ జిల్లాలో ఇప్పటి వరకు వివిధ రంగాల్లో సాధిం చిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి వివరిం చారు. చివరిగా కోనసీమ జిల్లా విజన్ -2047 డాక్యు మెం టును మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జెసి టి.నిసాంతి, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, ఎంఎల్‌సిలు ఇళ్ల వెంకటేశ్వరరావు, తోట త్రిమూర్తులు, కె.సూర్యనారాయణ రావు, ఎంఎల్ఎలు దేవ వరప్రసాద్, బండారు సత్యానందరావు, అంచ నాల కమిటీ చైర్మన్ వేగుళ్ళ జోగేశ్వరరావు, అయితా బత్తుల ఆనందరావు, గిడ్డి సత్యనారాయణ, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ముగ్గురి హత్య కేసులో 12 మంది అరెస్ట్

ప్రజాశక్తి - సామర్లకోట

ఇంటి నిర్మాణ విషయంలో ఏర్పడిన వివాదంతో ముగ్గురు హత్యకు గురైన సంఘటనలో ముగ్గురు మహిళలు సహా 12 మందిని అరెస్ట్ చేసినట్లు పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరి రాజు తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో సిఐలు ఎ.కృష్ణభగవాన్, అంకబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 15న వేట్లపాలెంలో బచ్చుల జకరయ్య వర్గీయులు చేసిన దాడిలో ముగ్గురు దారుణ హత్యకు గురయ్యారు. మరో ఏడుగురు చికిత్స పొందుతున్నట్టు చెప్పారు. కొంతకాలంగా వీరి మధ్య స్థలం విషయమై వివాదం జరుగుతుండగా, కార్దాల పండు కుటుంబంపై బచ్చుల జకరయ్య వర్గం ఆకస్మికంగా కత్తులు కర్రలతో దాడులు చేశారాన్నారు. మొత్తం 18 మంది దాడిలో పాల్గొన్నట్లు గుర్తించగా ముగ్గురు మహిళలు సహా 12 మందిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. అరెస్ట్ అయిన వారిలో బచ్చుల జకరయ్య, బచ్చుల మోషే, బచ్చుల బుల్లెప్పి, బచ్చుల దొరయ్య, బచ్చుల రాము, బచ్చుల గోపి , బచ్చుల గౌరయ్య, బచ్చుల రాజు, బచ్చుల సూర్యకాంతం, బచ్చుల భాగ్యవతి, ద్రోణం సత్యవేణి, కొత్తపల్లి చిన్నయ్యలను అరెస్ట్ చేసి వారి నుండి ఐదు కత్తులు మూడు కర్రలు ఒక ఆటో స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి వివరించారు. పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టి మిగిలిన నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. ఎస్‌ఐ పివిఎస్ మూర్తి పాల్గొన్నారు.

డమ్మీ తుపాకీతో బెదిరించి దుకాణంలో ఆభరణాల చోరీ

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడలో పట్టపగలు ఒక దొంగ డమ్మీ తుపాకీతో హల్‌చల్ చేసి తనిష్క్ బంగారం షోరూమ్‌లోకి చొరబడి ఉద్యోగిని బెదిరించి ఆభరణాలు దోచుకెళ్లిన వైనం బుధవారం చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే స్పందించి ఏటివార వార్ఫ్ రోడ్డులోని అటవీశాఖ కార్యాలయం సమీపంలో నిందితుడిని వన్ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి డమ్మీ తుపాకీతో పాటు బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని కాండ్రకోటలో బుధవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జున్ రావు తెలిపారు. ఆనూరు గ్రామంలో నిర్వహించిన దాడుల్లో ఒక వ్యక్తిని అరెస్టు చేసి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిఐ చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేటలో యువతకు గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు యువకులను అరెస్ట్ చేసినట్లు స్థానిక ఎస్‌ఐ రఘునాధరావు తెలిపారు. తమ సిబ్బంది తో జగ్గంపేటలో దాడులు చేయగా స్థానిక నెహ్రూ కాలనీకి చెందిన సునీల్, రామవరం గ్రామానికి చెందిన సుధీర్ వద్ద ఉనంచి 2.6 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, ఇద్దరినీ అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశ పెట్టగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. వారిని పెద్దాపురం సబ్ జైల్ కు తరలించినట్లు తెలిపారు.

14 కాసుల బంగారం, రూ.90 వేల నగదు అపహరణ

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరంలో 14 కాసుల బంగారం, రూ.90 వేల నగదు అపహరించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన బుజ్జిబాబు భార్యా పిల్లలతో జీవనోపాధి కోసం రాజమండ్రిలో నివాసం ఉంటున్నారు. బుజ్జి బాబు అత్త భీమవరపు సాయమ్మ ఆయన ఇంట్లో నివాసముంటోంది. ఈ నెల 14న ఇంటి దగ్గర్లోనే ఉంటున్న బంధువుల ఇంటికి ఆమె వెళ్ళింది. తెల్లారి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయని బుజ్జిబాబు తెలిపారు. సమాచారం తెలుసుకుని రాజమండ్రి నుంచి రామవరం గ్రామానికి వచ్చి చూసేసరికి ఆటక మీద డబ్బాలో పెట్టిన 14 కాసులు బంగారం, బీరువాలో పెట్టిన రూ.90 వేల నగదు చోరికి గురికావడంతో పోలీసులకు పిర్యాదు చేసామని చెప్పారు. దీంతో స్థానిక సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, ఎస్‌ఐ రఘునాధరావు, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి దర్యాప్తు చేపట్టారు.

సూర్యనారాయణ కుటుంబానికి ఉపాధ్యాయుల పరామర్శ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

. ఇటీవల మృతి చెందిన స్టేట్ గవర్నమెంట్ పింఛనర్ల అసోసియేషన్ గౌరవ సలహాదారు ఉప్పలగుప్తంకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు చిక్కం సూర్యనారాయణ కుటుంబాన్ని బుధవారం మండలంలోని ఉపాధ్యాయులు పరామర్శించారు. ఉపాధ్యాయుడిగా సుదీర్ఘకాలం పనిచేసి వేలాదిమంది విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఉపాధ్యాయ ఉద్యమంలో కీలక పాత్ర వహించారని ఉద్యోగ విరమణ అనంతరం అమలాపురం తాలూకా పెన్షనర్స్ యూనిట్ ఏర్పాటు చేయడంలోనూ పెన్షనర్స్ భవన్ నిర్మాణంలోనూ సూర్యనారాయణ కీలకంగా వ్యవహరించారని అమలాపురం యూనిట్ జిల్లా బ్రాంచ్ గా అప్ గ్రేడ్ చేయడంలో సూర్యనారాయణ ప్రధాన పాత్ర పోషించారని అన్నారు. సూర్యనారాయణ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో ఉపాధ్యాయ సంఘం నాయ కులు చిక్కం మైనర్ బాబు,నూకల ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఉపకరణాల పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

స్థానిక వాకలపూడి పంచాయతీ పరిధిలో ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యాన వికలాంగులకు ఉచితంగా కృత్రిమ పరికరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎంఎల్ఎ పంతం వెంకటేశ్వరరావు పాల్గొని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో వికలాంగులకు చేసే సేవా కార్యక్రమాల్లో తన వంతు సహకారం అందిస్తానన్నారు.

వెంకన్నను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండంలోని వాడపల్లి వేంకటేశ్వర స్వామివారిని పలువురు ప్రముఖులు బుధవారం దర్శించుకున్నారు. మాజీ మంత్రి, పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, ఎంఎల్ఎ బండారు సత్యానందరావు బుధవారం స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా వీరికి ఆలయ డిసి నల్లం చక్రధర్‌రావు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో స్వామి వారి దర్శనం చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలతో పాటు వారికి స్వామివారి చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, కెవి. సత్యనారాయణ రెడ్డి, ముదునూరి వెంకటరాజు, కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాధం తదితరులు పాల్గొన్నారు.

యనమలకు స్వాగతం పలికిన ఎంఎల్ఎ బండారు

ప్రజాశక్తి - రావులపాలెం

వాడపల్లి వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి విచ్చేసిన పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు బుధవారం రావులపాలెం విచ్చేయగా ఆయనకు ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పుష్పగుచ్ఛం అందచేసి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ కెవి.సత్యనారాయణ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు జక్కంపూడి వెంకటస్వామి, సయ్యపురాజు రామకష్ణం రాజు తదితరులు పాల్గొన్నారు.

వృధా నీరు మళ్లించేందుకు చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు

పంట భూముల్లో నీరు డ్రెయిన్ ద్వారా వృధాగా పోవడానికి గమనించిన రైతులు తిరిగి పంట కాలువ లోనికి మళ్లించేందుకు బుధవారం చర్యలు చేపట్టారు. గుమ్మిలేరుకు చెందిన పలువురు రైతులు నీటిని ఆదా చేశారు. ఆ గ్రామ పరిధిలోని నర్సిపూడి మీడియం డ్రెయిన్ ద్వారా నీరు వధాగా పోకుండా డ్రెయిన్‌కు అడ్డుకట్టు వేశారు. ఆ నీటిని చొప్పెల్ల నుంచి వల్లూరు వరకు వెళ్లే పంటకాలవ లోనికి మళ్ళించి వందల ఎకరాలకు సాగు నీటి ఇబ్బందులు లేకుండా రైతులే చేసుకోవడం గమనార్హం. చొప్పెల్ల కాలువకు దిగువన ఉండటంతో కాలువ శివారు భూములకు దాళ్వా వరి సాగులో నీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇబ్బందులను అధిగమించేందుకు రైతులు స్వచ్ఛందంగా నిధులు సమకూర్చుకుని బరకాలు, ఇసుక బస్తాలతో డ్రెయిన్‌కు అడ్డుకట్ట వేసి ఈ నీటిని పంటకాలువలోకి మళ్లించారు. తద్వారా గుమ్మిలేరు, మండపేట, వల్లూరు గ్రామాలకు పరిధిలోని సుమారు 600 ఎకరాలకు సాగునీరు సక్రమంగా అందుతుందని రైతులు వివరించారు. ఈ డ్రెయిన్ అడ్డుకట్ట పనులను స్థానిక నాయకులు, రైతు ప్రతినిధులు అముజూరి శ్రీనివాస్, యార్లగడ్డ రమేష్ చౌదరి తదితరులు పర్యవేక్షించారు.

రెండు సార్లు ప్రశ్నాపత్రాలు తీసుకువెళ్లడం ఉపాధ్యాయులకు భారం

ప్రజాశక్తి-అమలాపురం

ఎస్-1 పరీక్ష పేపర్లను రోజుకీ రెండుసార్లు పరీక్ష పోలీస్‌స్టేషన్ నుంచి తీసుకెళ్లడం ఉపాధ్యాయులకు భారమని ఎంఎల్‌సి ఐవి బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. మండల కేంద్రానికి 25 కిలోమీటర్ల పైన దూరంలో పాఠశాలలు కూడా ఉన్నాయని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని ఎంఎల్‌సి ఐవి తెలిపారు. అయినప్పటికీ కనీసం ఉదయమే రెండు పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలు ఇవ్వాలని కోరానని కమిషనర్ పరిశీలిస్తానని అన్నారని ఐవి అన్నారు. ఎస్-1 పరీక్షల విధి విధానాలపై కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు అందులోని ఇబ్బందులను గురించి కమిషనర్‌తో ఐవి మాట్లాడారు.

తడి, పొడి చెత్తను వేరుచేసి అందజేయాలి

ప్రజాశక్తి - అమలాపురం

ప్రభుత్వ, ఎన్‌జిటి ఆదేశాల మేరకు ప్రతి ఇంటి నుంచి వచ్చే చెత్తను తడి చెత్త ,పొడి చెత్త గా వేరుచేసి మున్సిపల్ శానిటేషన్ వర్కర్లకు అందజేయాలని అమలాపురం పట్టణం, 6వ వార్డ్ లోని రాజీవ్ వీధిలో ఉన్న మహిళలకు, గహిణులకు అవగాహన కల్పించారు. తడి చెత్తను ఆకుపచ్చ డబ్బాలోనూ, పొడి చెత్తను నీలం రంగు డబ్బాలోనూ హానికరమైన చెత్తను ఎరుపు రంగు డబ్బాలోనూ ఉంచి మున్సిపల్ వాహనం ఇంటి వద్దకు వచ్చినప్పుడు మున్సిపల్ వర్కర్స్ ద్వారా వాహనానికి అందచేయాలని తెలియజేశారు. వ్యర్థాలను సాధ్యమైనంత వరకు తగ్గించాలని, తడి చెత్త నుండి ఇంటి వద్దనే ఎరువును తయారుచేసి, మొక్కలను పెంచాలని, పొడి చెత్తను పునర్వినియోగం చేయాలని శానిటేషన్, ఎన్వి ర్రాన్మెంట్ సెక్రెటరీ బండి వీరన్న గహిణులకు అవగాహన కల్పించారు. వ్యర్థాలను తగ్గించడం పునర్వినియోగించడం ద్వారానే పర్యావరణాన్ని కాపాడవచ్చునని వివరించారు. కార్యక్రమంలో ఆరిగెల చిన్ని, స్థానిక మహిళలు, శానిటేషన్ వర్కర్లు పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రతి విద్యార్థి సైన్స్, శాస్త్ర సాంకేతిక అనుబంధ రంగాలపై అవగాహన ఉండాలని ఇస్రో రిటైర్డ్ శాస్త్రవేత్త యాళ్ళ శివ ప్రసాద్ సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని బుధవారం ఒక ప్రయివేటు కళాశాల్లో నిర్వహించిన సైన్స్ పరిజ్ఞానంపై జరిగిన సెమినార్ లో పాల్గొన్న శివ ప్రసాద్ విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆంగ్ల ఉపాధ్యాయుడు జెవిఎల్. నరసింహారావు, విత్తనాల వరప్రసాదరావు, పలువురు పాల్గొన్నారు.

ఫెన్షనర్లకు ఘన సన్మానం

ప్రజాశక్తి - అమలాపురం

ఎపిఆర్‌పిఎ ఆధ్వర్యంలో బుధం అమలాపురం స్థానిక యుటిఎఫ్ హోంలో పింఛనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 75 సంవత్సరాలు దాటిన పింఛనర్లను ప్రత్యేకంగా సన్మానించారు. పింఛన్ల అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ పిఆర్‌సి వెంటనే అమలు చేయాల న్నారు. ఐఆర్ విడుదల చేయాలని, పిఆర్‌సి బకాయిలను చెల్లించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని పలు సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు సత్య నారాయణ, ప్రధాన కార్యదర్శి గుబ్బల గోపాలకష్ణ, గౌరవాధ్యక్షులు బి.శ్రీరామ్మూర్తి, ఉపాధ్యక్షులు కె .రామచంద్రరావు, పిఎస్ శిరోమణి, కార్యదర్శులు ఎం.వెంకటేశ్వరరావు, సంసాని రామకృష్ణ, వివిఆర్‌కె.అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా తరగతులు



ఉప్పలగుప్తంలో ఎంపిడిఒ కార్యాలయంలో శిక్షణ

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలోని మండలపరిషత్ కార్యాలయాల్లో రెండురోజుల పాటు నిర్వహించిన వివిధ అంశాలపై శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ శిక్షణా కార్యక్రమాల్లో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: మండల ప్రజా పరిషత్ మరియు వెలుగు కార్యాలయములో రెండు రోజులు పాటు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. ఎంపిడిఒ బికెఎస్ఎస్.వెంకట రామన్ అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణా కార్యక్రమంలో తొమ్మిది అంశాలపై పంచాయతీ కార్యదర్శులు, సచివాల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు .ఈ శిక్షణా కార్యక్రమములో ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారులు, ఉద్యోగస్తులు, ప్రజా ప్రతినిధులు అవగాహనతో మంచి పరిపాలన అభివృద్ధి పనులు చేయుటకు ఎంతో ఉపయోగ పాడుతుందనే ఉద్దేశంతో ఇటువంటి శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. **ఆలమూరు:** ప్రతి ఒక్కరూ సుస్థిరమైన అభివృద్ధి, స్థానికీకరణ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని రాష్ట్ర ఎస్ఆర్‌డిసి అబ్జర్వర్ శ్రీనివాస్, డిఎల్‌డిఒ ఎస్‌టివి.రాజేశ్వరరావు, ఎంపిడిఒ, ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ ఐ.రాజు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ ద్వారా లోకలైజేషన్ ఆఫ్ సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్(ఎల్ఎస్డిజి) మీద ఎంపిడిఒ రాజు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం లోనూ, స్త్రీ శక్తి కార్యాలయంలోను సర్పంచులకు, ఎంపిటిసిలకు, కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు రెండవ రోజైన బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించి, పూర్తి చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, రాష్ట్ర ఎస్ఆర్‌డిసి అబ్జర్వర్ శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ మెహర్ ప్రకాష్, ఎంఇఒలు బి.అప్పాజీ, సుబ్బరాజు, ఎపిఎం ధనరాజు, ఎపిఒ అరుణకుమారి, మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్ కె.సతీష్ మోహన్ తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరు సాంకేతిక నైపుణ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని డిపిఆర్‌ఇకి చెందిన భీమేశ్వరి, ఇన్‌చార్జి ఇఒపిఆర్‌డి మోహన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి, బుధవారం రెండో రోజు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఎఒ రాజేంద్రప్రసాద్ , టేకి కార్యదర్శి కె.రామకృష్ణ మండల ఇంజినీరింగ్ అధికారి డివి. రాఘవులు తదితర అధికారులు, గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు. **మామిడికుదురు:** ప్రతి ఒక్కరూ గ్రామాలలో సుసిర మైన అభివృద్ధి లక్ష్యాలు సాధించేందుకు కృషిచేయాలని ఎంపిడిఒ కె.వెంకటేశ్వరరావు, ఇఒపిఆర్‌డి అడబాల శ్రీనివాస రావులు కోరారు మండల పరిషత్ కార్యాలయములో సర్పంచులకు, పంచాయితీ కార్యదర్శిలకు, సచివాలయ ఉద్యోగులకు రెండవ రోజైన బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించి పూర్తి చేశారు కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. **అల్లవరం:** స్థానిక ఎంపిపిడిఒ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు లో తొమ్మిదిఅంశాలపై సర్పంచులు, సెక్రటరీలు, మండల స్థాయి అధికారులు, సచివాలయం సిబ్బందికి రెండవ రోజు శిక్షణా కార్యక్రమం కోర్సు డైరెక్టర్, ఎంపిడిఒ బి.కృష్ణమోహన్ నిర్వహించారు. అధికారులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** ఆరోగ్యవంతమైన గ్రామాలే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపిడిఒ పిఆర్‌సి.రాజ్ కుమార్ సూచించారు. ఎంపిడిఒ కార్యాలయంలో సుస్థిరమైన గ్రామాభివృద్ధి ప్రణాళికపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా రెండో రోజు బుధవారం ఎంపిడిఒ కార్యాలయ ఎఒ ఎంఎల్ఎన్.మూర్తి అధ్యక్షతన సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు 9 అంశాలపై పవర్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మునిపల్లి సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ కె.సురేష్, పిహెచ్‌సి సూపం వైజర్ ఐ.చిట్టిబాబు, పంచాయతీ కార్యదర్శులు తిక్కిరెడ్డి రామకృష్ణ, పెట్టా నాగేశ్వరరావు, పల్లి పూర్ణచంద్రరావు, అడబాల శ్రీరామచంద్రమూర్తి, ఆకేటి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

తుపాను ప్రభావాన్ని దష్టిలో ఉంచుకుని రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని తహశీల్దార్ ఎంవి.సుబ్బలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో రైతులు డిసెంబర్ 21 వరకు వరి కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. మత్స్యకారులు తుపాను ప్రభావం తగ్గే వరకు వేటకు వెళ్లరాదని సూచించారు. ఇప్పటికే కోతలు కోసిన రైతులు ఒబ్బిడి చేసిన వరి ధాన్యమును భద్రపరుచుకొను ఏర్పాట్లు చేసుకొవాలని కోరారు. తుపాను ప్రభావంతో రానున్న మూడు రోజులు పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వ్యవసాయ శాఖ వారిని సంప్రదించి తగు సూచనలు పాటించాలన్నారు. తీర, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రాకూడదని, ఈదురు గాలులు విస్తాయనే సూచనల మేరకు పురాతన ఇళ్ళలో నివాసం ఉండేవారు స్థానిక తుపాను షెల్టర్లలో తలదాచుకునే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎటువంటి విపత్తు తలెత్తినా ఎదుర్కొనేందుకుఅధికారులు సిబ్బంది సన్నద్ధంగా ఉండాలన్నారు.